# కొద్ది కథలు

## క్రిస్టమస్ కానుక

మర్నాడు క్రిస్టమస్ పండుగ. ఆనాడు పాశ్చాత్యులంతా ఆనందముతో పండుగ చేసుకుంటారు. ఎంతలాంటి దంపతులైనా ఆనాడు అన్యోన్యప్రేమతో ఒకరికొకరు కానుకల నిచ్చుకొని ఆటపాటలతో ఆ రోజల్లా ఆనందంతో గడుపుతారు. గతించిన క్రిస్మస్ పండుగుల్లో ఓ యేడు డబ్బు లేకపోవడం! ఒక సంవత్సరం భార్యకు అస్వస్థత! ఇలా ప్రతి సంవత్సరం ఏదో ఒక ఆటంకం రావడంచేత జాన్ ఇప్పటి కొక సంవత్సరం కూడ అందరిలాగ ఆనందించ లేకపోయాడు. పోనీ ఈ సంవత్సరం ఏ ఆటంకంలేదు కదా యని పండుగ చేసుకోవడానికి జాన్ నిశ్చయించాడు. మర్నాటికి కావలసిన సామానులన్నీ కొనడానికి బజారుకు వెళ్లాడు! కాని దగ్గర డబ్బువుంటేగా కొనడానికి ? అప్పుడు చేతినున్న రిస్టువాచీ తీశాడు. దానికి చిరిగిపోతూ పాతబడియున్న తోలుబెల్టు తీసిపారవేసి వాచీని ఏభై షిల్లింగుల కమ్మేశాడు. ఆ వచ్చిన సొమ్ములో కొంత భాగంపెట్టి తన భార్యకు జడపిన్నుకొని కానుకగా తీసికొనివెళ్లాడు. ఈ సంగతి అతనిభార్యకు తెలియదు. ఆమె కూడ యితనివలెనే మర్నాడు క్రిస్టమస్‌పండుగచేసితీరాలని నిశ్చయించుకొని సామాను కొనడానికి బజారుకు వెళ్లింది కాని ఆమెవద్దకూడ డబ్బులేదు. వెంటనే ఆమె శిరోజాలను ఒక సవరాల వర్తకున కమ్మి ఎనభై షిల్లింగులు సంపాదించింది. ఆసొమ్ములో కొంత భాగముతో చాలా కాలము నుండీ తన భర్త రిస్టువాచీకి తోలుబెల్టు కట్టుకుంటున్నాడు కదా యని విచారించి బంగారు వాచీగొలుసు కానుకగా తీసికొనివెళ్లింది.

మర్నాడు భార్యా భర్త లిరువురు చర్చిలో కలుసుకున్నారు. క్రాపింగుతో వున్న భార్యను చూచి జాన్ ఆశ్చర్య పడ్డాడు.

"నావాచీని అమ్మి నీకోసమే ఈజడ పిన్ను తెచ్చాను మై డార్లింగ్!" అని అన్నాడు నిట్టూర్పుతో.

"నా శిరోజాల నమ్మి మీకోసమే ఈ వాచీగొలుసు తెచ్చాను! మై మాస్టర్!" అంది తలదించుకొని అతని భార్య.

పంతుల కృష్ణారావు.

* * *

## టి. టి. సి. గారి తెల్ల మొహం

అవి గుంటూరులో చదువుకొనే రోజులు. సినిమా చూడాలంటె బెజవాడ వెళ్లేవాడిని టికెట్టు కర్చు లేదు గదా అని. "జుగును" చూద్దామని బయలుదేరా విజయవాడకి. కర్మవశాత్తు ఆరోజున 3 వ తరగతి టికెట్టు కొన్నా. ఇంటర్‌క్లాసులో కూర్చుని చిత్రగుప్త చదువుతున్నాను. నంబూరుస్టేషనులో టి.టి.సి.గారు చెకింగుకువచ్చారు. నా టికెట్టు చూసి ఎక్సెస్‌కట్టమన్నాడు. బెజవాడస్టేషనులో యిస్తానండి అని మనవిచేసా. టికెట్టు తీసుకుని వెళ్లిపోయాడు యెక్కడికి పోతాడనే ధీమాతో? మంగళగిరిలో ఆ కంపార్టుమెంటు దిగి మూడవ తరగతి పెట్టికి వెళ్లాను. బెజవాడలో దిగి బ్రాడ్‌గేజిగేటులోంచి చల్లగా బ్రిడ్జియెక్కాను. పాపం టి. టి. సి. గారు నాకోసరమని ఇంటర్‌పెట్టె దగ్గర కాసారు. పైనుంచి చప్పట్లుకొట్టే సరికి పాపం తెల్లబోయ్ చూచి బుర్ర పంచుకు టీష్టాలుకు నడిచాడు.

పోకల వెంకటేశ్వరరావు.

* * *

## మొగ ప్రియురాలు!

వేసంగి శెలవులు ఇక్కడేగడపమని అత్తయ్యా అహ్వానించటంచే (ఆహ్వానించటం యేమిటి లెండి, అజ్ఞాపించటం అనడం మంచిది) వాళ్ల వూరు వెళ్లాను. కాని మద్రాసు రుచులు మరిగిన మాబోటి రఖాలకు పల్లెకొంప లెలా నచ్చుతాయ్? ఓవారంరోజులుకాలాన్ని చంపటానికే చాలకష్టమనిపించి జండా ఎత్తేయడానికి సమకట్టాను. కాని మా అత్తయ్య "ఆపాడు మద్రాసు వెధవ హొటలు మెతుకులు తిని పడివుండకపోతే, ఇక్కడ వుంటం మంచిది కాదేమిటి?" అంది. ఎవర్నైనా నచ్చచెప్పవచ్చు కాని, మా అత్తయ్యాను నమ్మించటం మహాకష్టం. 'వెళ్లి సెకండ్‌ఇయర్ బుక్కులు చదువుకోవాలి అత్తయ్యా!' అని బొంకి 'నీ ఇష్టంవచ్చినట్టు అఘోరించు!' అని ఆమెచేత చీవాట్లుతిని బయలుదేరాను. వెళ్లేటప్పుడు 'అత్తయ్యా! నాకొచ్చే పుత్తరాలు రీ డైరక్టు చెయ్యి!' అని చెప్పి వచ్చేశాను.

ఆరోజు కులాసాగా 'చిత్రగుప్త' చదువుకొంటుంటే అత్తయ్యాదగ్గర్నించి వెంటనే బయలుదేరి రావలసిందని

వుత్తరం వచ్చింది. వచ్చి వారంరోజులు కాలేదు యేమిటా అనుకొంటూ కంగారుగా వాళ్ల ఇంటికి వెళ్లేసరికి ఆమె వొకటే మండిపడుతూంది. 'మద్రాసు పోగానే బుద్ధులు మారుతుంటాయ్! —అందుకే కాబోలు వుత్తరాలు రీడైరక్టు చేయమన్నావ్! — 'అయినాగాని రాము నీవిలా తయారవుతావ్ అనుకోలేదు!'—ఇలా డొంకతిరుగుడుగా తిట్టి 'ఈరాధ ఎవరో చెప్పు!' అంటూ ఓ ఉత్తరం నా మొహాన కొట్టింది. ప్రియమైన రామూ—నీవు వుత్తరాలు ఎందుగ్గాను వ్రాయటం నిలిపివేసావు? నీ జాబులు రాకుంటే నాకేమి తోచదు. దీనికైన జవాబు వ్రాయ్—నీ ప్రియమైన రాధ'. అది నామిత్రుడు రాధాకృష్ణ వ్రాసింది! చదువుమీద అతన్ని 'రాధా' అని పిలుస్తాను అని చెప్పగానే అత్తయ్యొ ఒక్క నవ్వు నవ్వి 'అయితే నీకు మొగప్రియురాండ్లు కూడ వున్నారన్నమాట!' అంది. రాము.

*   *   *

## గృహ బడ్జట్

ఈమధ్యరాష్ట్ర, కేంద్రప్రభుత్వబడ్జట్ల గురించి పేపర్లలో చదివింతర్వాత నేనూ వచ్చేనెల గృహబడ్జట్ తయారుచెయ్యాలనుకుని ఫస్టుతారీకు జీతం 125 రూపాయలు చేతిలోపడగానే ఇంటికి వెళ్లి సావకాశంగాకూర్చున్నా బడ్జట్‌తయారుచేసేనిమిత్తం. మా ఆవిడ సహకారం కూడా వుంటే మరీ బాగుంటుందని నెమ్మదిగా పిలిచి నా ఉద్దేశ్యం తెలియపరిచా. మొదట్లో "అన్నీ అనుకున్నట్లు జరిగాయి కనుక ఇదొక్కటే జరగటానికి" అన్నది గాని చివరికి బలవంతంమీద నాతో పూర్తిగా సహకరించడాని కంగీకరించింది. ప్రధమంగా తప్పని సరిఅయిన విషయాలు తీసుకున్నాం. అంటే ఇంటి అద్దె 30 రూపాయలు, కాఫీ ఖర్చు 20 రూపాయలు. ఇక మిగిలిన 75 లో ఇంట్లోవాడటానికి 50 రూ॥ కేటాయిస్తే బాగుంటుందని ప్రతిపాదించా. కాని అది చాలా చిన్న మొత్తమని, ప్రతినెలా 60 రూ॥ కూడా సరిగా సరిపోవటం లేదనీ మా ఆవిడ అప్పోస్ (Oppose) చేయటం మూలాన, ఇంటి ఖర్చుక్రింద 60 రూ॥ నిర్ణయించాం. నాకు చేతిలోకి 15 రూపాయలన్నా లేందే కష్టమన్నా.

"ఆ మిగిలిన 15 మీరే తీసుకుంటే మరి నాకు చేతిలోకో" అంది మాఆవిడ.

"ఇంట్లో వాడటానికి కేటాయించిన మొత్తంలో నీ యిష్టమొచ్చినంత మిగుల్చుకో" అన్నా నవ్వుతూ.

"అసలింట్లోకొకటిసరిగ్గా సరిపోతేగా" అంది.

"వారాని కోరోజు భోజనం మానేస్తే ప్రభుత్వంతో పూర్తిగా సహకరించినట్టూ వుంటుంది. మనకూ కొంతమిగుల్తుంది" అన్నా.

"బాగా చెప్పారు. భోజనం మానేస్తే దాని బదులు పండో ఫలమో తినకుండా వుండగలమా! ఏమిటి. దానికీ బోలెడం తవుతుంది" అంది మాఆవిడ.

మా ఆవిడ చేతిఖర్చుకి నాలుగైదు రూపాయలూ ఎట్లా రాబట్టాలా అని రెండు గంటల సేపు సుదీర్ఘ చర్చ సాగించి చివరికి కాఫీ క్వాలిటీ కన్న క్వాన్‌టిటీ కొంచం తగ్గించినందువల్ల లోటుభర్తీ చేయవచ్చునని నిర్ణయించి బడ్జట్ పూర్తయిందనిపించాం.

పట్టుమని పదినిమిషాలైనా కాలేదు. "పండక్కి తీసుకున్న చీరెలబాపతు పాతికరూపాయలు ఇప్పిస్తారాపంతులుగారూ" అంటూ కాతాదారు రాజయ్యొ వచ్చాడు.

"నిజమే దానివిషయమే మర్చిపోయాం మనిద్దరం" అన్నా ఆశ్చర్యముగా. "అయినా మీచేదస్తం గాని పులినిజూసి నక్క వాతలుపెట్టుకుందిట. ప్రభుత్వానికీ మనకీ సాపత్యం ఎక్కడండీ బడ్జట్ తయారుచెయ్యడానికి" అంది మా ఆవిడ.

బొమ్మకంటి రామారావు.

## అత్తయ్యొ సరసం

"ఒరే అబ్బాయి" అని పిలిచింది వెంకమ్మ వీధి గడపమీద చదువుతున్న మేనల్లుడ్ని.

"ఆ ఒస్తున్నా! ఒస్తున్నా !" పుస్తకం గూట్లో గిరాటువేసి చక్కా వచ్చాడు.

"నీకు జోశ్యంచెబుతా? నాకేమిస్తావ్ నిజమైతే."

"అఁ ఎప్పుడూ ఇంతే! నేను మొన్న కొన్న కొత్త గాలిపటం యిస్తా. ఈ వూళ్ళో ఎవ్వరికీ లేదు."

"నాకెందుకురా అవి తలకాయ తగలేశేందుకు."

"నీకేం తెలీదు. నువ్వు తలపాతుకున్నా యిల్లాంటి గాలిపటం దొరుకుతుందా ? దీని విలువ నీకేం తెలుస్తుంది! చెప్పవే అత్తా విషయం !"

"బలే! నీకు ఓ చిన్న బంగారు అమ్మాయినిచ్చి పెళ్ళిచేస్తారు !"

"అల్లానా ! పెళ్ళా ! నాకు వద్దు బాబూ !

నిన్ను మేష్టారు కొట్టినట్టు బాదరురా ! నీకు పసుపురాసి, తలంటి నీళ్లు పోసి కొత్తబట్టలు కట్టించి, సవ్వారీపైన ఊరేగించి యింకా ఎన్నో చేస్తారు.

అబ్బా ...నాకొద్దు పసుపు. అంతా నవ్వుతారు.

కాదురా ! పిండివంటలు వండుతారు. మిఠాయి చేస్తారు యిస్తారు.

అన్నీ నాకు యిచ్చేస్తారా !

అన్నీ మనకే ! గంపలు చేసిపంపుతారు. వాటిని గందులోదాచి ప్రతీరోజు కొంచం ...కొంచం ...నీకు ఉంగరం యిస్తారు ...కట్నం ఇస్తారు.

ఏకట్నమె! అత్తయ్యొ.

"వెయ్యి రూపాయలు !"

అయితే చూడు. "నిజం" మోటారు కొంటాను. నిన్ను ఎక్కించుతాలే.

అవే చూడు ! మొదట్లో బెదిరావు. ఎంత బాగుంటుందో పెళ్లి.

పెళ్లి బాగుందిగాని ఒడుగులా పంచశిఖలుపెట్టి బుర్ర గొరగరు కదా !

వెధవా ! నీకేం పొయ్యేకాలం, శుభమల్లే పెళ్లిగురించి చెబుతే, అపశకునం మాటలేమిటిరా అంటూ లేచిపోయింది.

బులుసు సోమయాజులు.